క్లుప్తంగా

పరిసరాల శుభ్రతపై స్పెషల్ డ్రైవ్



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో పరిసరాల శుభ్రతకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం ఉదయం 7గంటల నుంచే గ్రామంలోని ప్రధాన వీధులు, ఖాళీ జాగాల్లో చెత్తను శుభ్రం చేయించడం, మురుగునీటి కాలువల్లో పేరుకున్న షిల్టులను తొలగించడం, దోమల నివారణకు మలాథిన్ మందు పిచికారీ చేయించడం వంటి పారిశుద్ధ్య పనులను చేయించారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వస్తువులు వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నూతన కార్యవర్గ సభ్యులు

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో బాధ్యతలు స్వీకరించారు. మాజీ అధ్యక్షుడు గోపీచంద్, మాజీ ప్రధాన కార్యదర్శి మార్టిన్ నుంచి నూతన అధ్యక్షుడు గొట్టి గజేంద్ర నూతన ప్రధాన కార్యదర్శి విద్యానాథరెడ్డి రికార్డులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గొట్టి గజేంద్ర మాట్లాడుతూ తిరుపతిలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇటీవల ఎన్నికల్లో కొత్తగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు మునెయ్య, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి రాజేష్, గ్రంథాలయ కార్యదర్శి సునీల్ కుమార్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి నాగరాజ, మహిళా మెంబర్ కోమలాదేవి బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడు గొట్టి గజేంద్రతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



షెడ్డును తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చంద్రగిరి: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని మిట్టపాళెం పంచాయతీ శ్రీనివాస మంగాపురం నుంచి శ్రీవారిమెట్టు మార్గంలోని సర్వే నంబరు 702లోని కాలువ పోరంబోకు స్థలంలో కొంతమంది అక్రమంగా షెడ్డును నిర్మించారు. దీంతో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక వీఆర్‌ఓ విష్ణు తన సిబ్బందితో కలసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ భూమిలో అక్రమంగా షెడ్డును నిర్మించారని తేలడంతో, సిబ్బందితో కలసి షెడ్డును తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మెర్జింగ్ కొత్త కాదు

- ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ అనుమతితో అవసరమైన మేర తాత్కాలిక అధ్యాపకుల నియామకం
- ఇప్పటి వరకు ఒక్క అకడమిక్ కన్సల్టెంట్‌నూ తొలగించలేదు
- నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలను మెరుగు పరచడమే వర్సిటీ లక్ష్యం
- సాక్షితో వీసీ సీహెచ్ అప్పారావు



ఎస్వీయూ ప్రవేశ ద్వారం

తిరుపతి సిటీ: అకడమిక్ కన్సల్టెంట్ల నియామకాలకు సంబంధించి వచ్చే 2025–26 విద్యాసంవత్సరానికి నూతన నోటిఫికేషన్ విడుదల చేస్తామని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్ల తొలగింపు, విభాగాల మెర్జింగ్ విషయంపై సాక్షి వీసీని సంప్రదించగా ఆయన పలు అంశాలపై స్పందించారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలోని అన్ని విభాగాలలో అవసరం మేరకు తాత్కాలిక అధ్యాపకులను ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఈసీ అనుమతితో త్వరలో కొత్త నోటిఫికేషన్ ద్వారా భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పారు.

తొలగిస్తున్నారనేది అబద్ధం

వర్సిటీలో విభాగాల మెర్జింగ్ ప్రక్రియ కొత్తగా చేపట్టింది కాదన్నారు. గతంలోనే అధికారికంగా ఈ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. అకడమిక్ కన్సల్టెంట్లను తొలగిస్తున్నారంటూ వస్తున్న వార్తలు సత్యదూరమన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని విభాగాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణతో పాటు ఉపాధి కల్పనే లక్ష్యంగా వర్సిటీ పనిచేస్తుందని తెలిపారు. త్వరలో విడుదల చేయనున్న నూతన నోటిఫికేషన్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకుల నైపుణ్యాన్ని, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటామని సాక్షి అడిగిన ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. డీడీఈ పరీక్షలు కోర్టు ఆదేశాల మేరకు, యూజీసీ డెబ్ నిబంధనలకు లోబడి ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. తొలి రోజు పరీక్షను అన్ని సెంటర్లలో పకడ్బందీగా నిర్వహించగా, ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

పీజీలో ప్రవేశాలు పెరుగుతున్నాయ్..



ఎస్వీయూలో పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. నూతన విద్యా విధానం వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలో అమలు జరుగుతోంది. గతేడాది నుంచి పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పెద్దఎత్తున పెరిగాయి. ఈ ఏడాది పీజీ సెట్ నిర్వహణ ఎస్వీయూ ఆధ్వర్యంలో జరుగుతోంది. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అలాగే వర్సిటీలో తక్కువ అడ్మిషన్లు గల కొన్ని పీజీ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారించాం. అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేస్తున్నాం. గతం కంటే ప్రవేశాలు ఈ ఏడాది పెరిగే అవకాశం ఉంది. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వర్సిటీ పరిధిలో వచ్చే ఏడాది నుంచి అన్ని కోర్సులకు నిర్ణీత సమయానికి పరీక్షలు నిర్వహించి ఫలితాలను విడుదల చేసేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నాం. వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా అధ్యాపకుల, ఉద్యోగుల సమన్వయంతో ముందడుగు వేస్తున్నాం.

– సీహెచ్ అప్పారావు, వీసీ

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 5.15 నుంచి 9.15 గంటల వరకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ
- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రిలో ఉదయం 9.30 గంటలకు రోటరీ హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ప్రారంభం
- ఆర్‌సీ రోడ్డులోని అవిలాల సమీపంలో ఉదయం 9.30 గంటలకు భాష్యం నూతన బ్లూమ్స్ క్యాంపస్ ప్రారంభం
- జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరుగుతాయి.
- ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాలిటెక్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ.
- అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8.15 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభ మహాశాంతి అభిషేకం , పూర్ణాహుతి
- ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ మిషన్ ఆశ్రమంలో సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచన నిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మచే శ్రీమద్రామాయణ ప్రవచనామృతం

అత్యవసర సమయంలో అయినా వాడండి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న జీఎస్ఎస్ నాయకులు

తిరుపతి సిటీ: వర్సిటీలోని నూతన అంబులెన్స్‌ను విద్యార్థుల అత్యవసరాల కోసం వినియోగంలోకి తేవాలని జీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీసీ సీహెచ్ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఎస్వీయూ విద్యార్థులు, ఉద్యోగుల అత్యవసరాల కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.30 లక్షల విలువ గల నూతన అంబులెన్స్‌ను వర్సిటీకి అందించిందన్నారు. ఈ అంబులెన్స్‌ను అందించి నాలుగు నెలలవుతున్నా వర్సిటీ అధికారులు గోడౌన్‌లో మూలన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన పత్రాలు లేని, కాలం చెల్లిన అంబులెన్స్‌ను ఇప్పటికీ వర్సిటీ అధికారులు వినియోగించడం దారుణమన్నారు. గత వారంలో వర్సిటీలో ఉద్యోగి చనిపోతే మృతదేహాన్ని స్వస్థలానికి చేర్చేందుకు కాలం చెల్లిన వాహనంలో పంపడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టండి



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరంలో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ , డీఆర్ మహల్ రోడ్డు, హరేరామ హరే కృష్ణ మార్గం, న్యూ బాలాజి కాలనీలోని ట్రాన్స్ఫర్ స్టేషన్, అన్నా క్యాంటీన్‌ను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలుచోట్ల భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటున్నాయని, వాటిని వెంటనే శుభ్రం చేయించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో స్వీపింగ్, చెత్త కుప్పల తొలగింపు ప్రతి రోజూ చేయాలని సూచించారు. గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన చెత్త నిర్వహణ పాయింట్ లాగే అన్ని అపార్ట్‌మెంట్ల వద్ద చేసేలా చూడాలని, ఇస్కాన్ వంటశాల వద్ద తడి చెత్తతో గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న విధంగా హోటళ్ల యాజమాన్యం చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అన్నా క్యాంటీన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, సిబ్బంది ఉన్నారు

పేదల ఇళ్లను కూల్చేసి..



తిమ్మినాయుడుపాలెం పరిధిలో ఇళ్లు కూల్చేసిన స్థలంలో రోడ్డు వేస్తున్న దృశ్యం

తిరుపతి మంగళం : తినడానికి పట్టెడు అన్నం లేక.. ఉండడానికి కాస్త చోటు లేక అలమటిస్తున్న నిరుపేదలెందరో తిరుపతి నగరంలో జీవనం సాగిస్తున్నారు. పేదలకు గూడు కల్పించకపోవడం పక్కన పెడితే ఉన్న గూడును కూడా కూల్చేసిన ఘనత కూటమి పాలనలో కార్పొరేషన్ అధికారులకే దక్కిందని చెప్పవచ్చు. తిరుపతి నగర పరిధిలోని కొంకాచెన్నాయగుంట లెక్కదాఖలాలు తిమ్మినాయుడుపాలెం పరిధిలో సర్వే నంబర్ 162లోని కాలువ పొరంబోకు స్థలంలో గత పదేళ్లగా పదిహేనుమంది చిన్న రేకులషెడ్లును నిర్మించుకుని కరెంట్ మీటర్లు తీసుకుని, కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తూ కూలీనాలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే గత రెండు నెలల క్రితం కాలువ పొరంబోకు స్థలం ఆక్రమించుకున్నారంటూ కార్పొరేషన్ అధికారులు అక్కడ గత పదేళ్లగా ఉన్న ఇళ్లను కూల్చేశారు. అదే స్థలంలో ఇప్పుడు పక్కనే ఉన్న లేఅవుట్‌లోని బడానేతల ప్లాట్లకు రోడ్డు వేసుకుంటున్నా కార్పొరేషన్ అధికారులు కిమ్మనకుండా ఉన్నారు. పదేళ్లగా ఉన్న ఇళ్లను కూల్చేసిన అధికారులు.. ఇప్పుడు బడాబాబులు రోడ్డు వేసుకుంటున్నా చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు భగ్గుమంటున్నారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌పై దాడి దుర్మార్గం

- అక్రమ కేసులకు భయపడేది లేదు
- దాడి చేసిన వారే ఫిర్యాదు చేస్తారా ?
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : ఇంట్లోకి చొరబడి వైఎస్సార్‌సీపీ సర్పంచ్, కుటుంబ సభ్యులపై దాడి చేయడం హేయమైన చర్య అని చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సామిరెడ్డిపల్లికి చెందిన అర్జున్‌రెడ్డి, అతని కుమారులు అరుణ్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి స్థానిక గ్రామానికి చెందిన సర్పంచ్ అమరావతి, జగన్నాథరెడ్డి దంపతులు వారి ఇంటిలో ఉండగా వారిపై అక్రమంగా దౌర్జన్యానికి తెగబడిన విషయం విదితమే. ఆపై దాడికి దిగిన వారే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు కూడా స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం సామిరెడ్డిపల్లికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, న్యాయ పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అధికార పార్టీ అండదండలు ఉన్నాయని దౌర్జన్యానికి తెగబడి, దాడి చేసి తిరిగి వారే పోలీసులకు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు బాధితులకు న్యాయం చేయాలని, దౌర్జన్యంగా దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, మహేష్, హరీష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై విద్యార్థులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఆటిజానికి గురైన పిల్లలకు కొన్ని మెళకువలు నేర్పి, శిక్షణతో సమాజంలో స్వతంత్రంగా జీవించగలిగే ప్రయత్నం చేయవచ్చని అధ్యాపకులు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఈడీ విద్యార్థినులకు బుధవారం వర్సిటీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆశ్రిత చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ కవిత, డాక్టర్ భారతి అతిథులుగా హాజరయ్యారు. ఆటిజం చిన్నతనంలోనే కనిపించే నరాల బలహీనతకు సంబంధించిన సమస్య అన్నారు. జన్యుపరమైన మార్పులు, మానసిక, శారీరక లోపాలు కారణాలుగా చెప్పవచ్చన్నారు. దీని ప్రభావం జీవితాంతం ఉంటుందని, ఆటిజంకు పూర్తిస్థాయిలో నయం అవడం అసంభవం అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసూన, రాష్ట్రీయ సేవాసమితి ప్రిన్సిపల్ డాక్టర్ నందిని, విద్యార్థులు, ఆటిజం పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నేతలు



డీఆర్వోకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

– కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన

తిరుపతి అర్బన్: కోవిడ్ సమయంలో మృతి చెందిన ఉపాధ్యాయులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ చిరంజీవి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పూల్‌లో వారికి కారుణ్య నియామకాలను జాప్యం లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ కాలం ఇప్పటికే 21 నెలలు గడిచిపోయిన కనీసం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కనీసం కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57ను అమలు చేయలేదని, వెంటనే 2003 డీఎస్సీ వారికి పాతపెన్షన్ విధానంలోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈఓ, డైట్ ప్రిన్సిపల్, డీఈఓ పోస్టులు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని వెంటనే జీఓ నంబర్ 73, 74 ,75 అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియాన్ని కనీసం సమాంతర మీడియంగా అయినా అమలు చేయాలని కోరారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన 3 పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట్రావ్ మాట్లాడుతూ సరెండర్ లీవ్ బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రమేష్, సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, కోచైర్మన్ శేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌లు డి.రామచంద్రయ్య, మురళీకృష్ణ, జగన్నాథం, కార్యదర్శులు రమేష్, బాల సుబ్రమణ్యం, విశ్వనాథ్, మల్లికార్జున, కోశాధికారి లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందించారు.

ఇది మీకు తెలుసా..!

ఆరు నుంచి 14 సంవత్సరాల బాలబాలికలకు అందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలనే ప్రధాన లక్ష్యంతో దేశంలో విద్యాహక్కు చట్టం–2009ని ఏర్పాటు చేశారు. 2010 ఏప్రిల్ ఒకటో తారీఖు నుంచి దేశమంతటా ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ఇందులో 4వ అధ్యాయం సెక్షన్ 13 ప్రకారం విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎంపిక పరీక్షలు నిర్వహించరాదు. అలా నిర్వహిస్తే రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలల్లోనూ బోధనా రుసుము కాకుండా అడ్మిషన్ ఫీజులు, ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదు. అలా వసూలు చేస్తే దానికి పదిరెట్లు జరిమానా విధిస్తారు. పాఠశాలల్లో ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది.. జాగ్రత్త సుమా.. తల్లిదండ్రులు అప్రమత్తతతో వ్యవహరించి పాఠశాలల యాజమాన్యాలను నిలదీయండి.

– తిరుపతి సిటీ

ఎంసెట్, నీట్ ప్రవేశాలకు ఉచిత శిక్షణ

తిరుపతి సిటీ: స్థానిక ప్రకాశం రోడ్డులోని పురందరదాస్ కాంప్లెక్స్‌లోని శ్రీవిద్య అకాడమీలో నీట్, ఎంసెట్–2025 పరీక్షలకు మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు చెందిన పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ డి.దివ్యరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలకు 7013119918, 9381857533 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భూపతిరెడ్డికి కొనసాగుతున్న చికిత్స

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేఖలచేను గ్రామంలో సోమవారం అర్ధరాత్రి కత్తిపోట్లకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్త భూపతిరెడ్డి ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడినప్పటికీ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. కడుపు, గొంతు భాగంలో కత్తి పోట్లు కొంత లోతుగా దిగడంతో ఇన్‌ఫెక్షన్ రాకుండా రుయా ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. కత్తిపోట్లకు గురై ప్రాణాలతో బయటపడిన భూపతిరెడ్డిని గ్రామస్తులు, అతని సమీప బంధువులు బుధవారం పరామర్శించి ఓదార్చారు. కాగా గ్రామంలో రెండు పార్టీల మధ్య తలెత్తిన విభేదాలే ఈ దారుణానికి కారణమని తెలుసుకున్న వారంతా రాజకీయాల కోసం మనుషులను చంపడం ఏమిటి..? అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పరిస్థితి చక్కబడేంత వరకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చైన్ స్నాచర్‌కు రిమాండ్

తిరుపతి లీగల్: మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లిన కేసులో ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం బీఆర్ నగర్‌కు చెందిన జి.నాగచిన్న, వెంకటేశ్వర్లు అలియాస్ గిరికి ఈనెల 15వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కోర్టు కానిస్టేబుల్ శేఖర్ తెలిపిన వివరాలు.. గత నెల 27వ తేదీ తిరుపతి, ఎస్వీ నగర్, వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో నిందితుడు నాగచిన్న వెంకటేశ్వర్లు ఓ మహిళ మెడలోని 20 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

సూర్యప్రభ వాహనంపై లోకాభిరాముడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న కోదండరాముడు



చంద్రప్రభ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీరామచంద్రమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనంపై కొలువై లోకాభిరాముడు తేజోవిలాసంతో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. గజరాజులు, వృషభాలు, అశ్వాలు ముందు నడుస్తుండగా, భజన బృందాల భక్తి సంకీర్తనల నడుమ కోలాటం నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులకు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. తర్వాత రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన కోదండరాముడు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కోదండరాముని రథోత్సవం

కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరగనుంది. ఉదయం 5.15 గంటలకు మీన లగ్నంలో స్వామివారు రథారోహణం చేసి ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేయనున్నారు.



స్వామివారి వాహన సేవలో దేవతామూర్తుల వేషధారణలో నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఎస్వీయూలో చిరుత హల్‌చల్



చిరుత దాడిలో మృతి చెందిన కృష్ణ జింక

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ బాయ్స్ హాస్టల్స్‌కు కూతవేటు దూరంలోని పొదలలో బుధవారం చిరుత సంచరిస్తున్నట్లు విద్యార్థులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన విద్యార్థులు కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే హాస్టల్స్ సమీపంలో సంచరిస్తున్న జింకను వేటాడి చంపినట్లు విద్యార్థులు తెలిపారు. గత నాలుగు నెలలుగా వేదిక్, వెటర్నరీ, ఎస్వీయూ పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోన్లు పెట్టి, హెచ్చరిక బోర్డులు అమర్చి అటవీ అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు.